క్లుప్తంగా

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు



అక్రమంగా మట్టి తరలిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో మంగళవారం యథేచ్ఛగా మట్టి తవ్వకాలు, రవాణా చేశారు. పరిసర ప్రాంతాల్లోని చెరువుల నుంచి మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. కూటమి నాయకులు మట్టి తవ్వకాలు చేస్తున్నా అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలను నివారించాలని పలువురు కోరుతున్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: స్థానిక సురక్ష హాస్పిటల్‌లో వృద్ధులు, వితంతువులు, అనారోగ్యంతో ఉన్న బాధితులకు మంగళవారం దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశామని హాస్పిటల్ అధినేత కొండముది శ్యామల దిలీప్ తెలిపారు. సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా తమ హాస్పటల్లో ఆటోవాలాలకు, రిక్షా పుల్లర్లకు, వారి కుటుంబాలకు కూడా ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. 12 ఏళ్లుగా హాస్పిటల్లో గిరిజన ప్రాంత ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు అందిస్తుండగా, ఇప్పుడు ఆటో, రిక్షా వర్గాల వారికి విస్తరించడం అభినందనీయమని కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు.

కందుకూరికి నివాళి



కందుకూరికి నివాళులర్పిస్తున్న చిన్నారులు

కొయ్యలగూడెం: నవయుగ వైతాళికుడు సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతి కార్యక్రమం మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో నిర్వహించారు. స్పందన స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు బలుసు నాగేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై వీరేశలింగం పంతులు ఘనతను చిన్నారులకు వివరించారు. కందుకూరి చిత్రపటం వద్ద చిన్నారులు నివాళులర్పించారు.

ఉన్నతమైన జీవనం కల్పించేలా కృషి



వన్‌దన్ కేంద్రాన్ని సందర్శించి మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాములు నాయక్

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని మహిళలకు వన్‌దన్ వికాస్ కేంద్రాల ఏర్పాటు ద్వారా ఉన్నతమైన జీవనోపాధి కల్పించేలా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఐటీడీఏ పీఓ కె.రాములు నాయక్ అన్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన కామవరంలో ఏర్పాటు చేసిన వన్‌దన్ వికాస్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వన్‌దన్ కేంద్రాల్లో మహిళలు తయారు చేసే వస్తువులకు మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వెలుగు ఏపీడీ రాజబాబు, డ్వాక్రా సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

అధిక లోడు వాహనాలకు జరిమానాలు

చింతలపూడి : పరిమితికి మించి అధిక లోడుతో తిరుగుతున్న లారీలు, టిప్పర్లపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. జిల్లాలోని చింతలపూడి, లింగపాలెం మండలాల్లో ఏలూరు వెళ్లే ప్రధాన రహదారిపై పరిమితికి మించి అధిక లోడుతో తిరుగుతున్న లారీలు, టిప్పర్లకు మంగళవారం రోడ్డు టాక్స్, ఫిట్నెస్ లేని వాహనాలను గుర్తించి సుమారు రూ.1.50 వేలు అపరాధ రుసుము విధించినట్లు రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో పాల్గొన్న నూజివీడు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు అన్నపూర్ణ, కృష్ణ వేణి మాట్లాడుతూ వాహనచోదకులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్లను ఉపయోగించవద్దని, ఇతరులతో మాట్లాడకుండా అన్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై శిక్షణ

బుట్టాయగూడెం: మండలంలోని కొల్లాయిగూడెంలో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ ఉద్యానవన విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రంకు చెందిన డాక్టర్ దేవీ వరప్రసాద్ రెడ్డి పెరటికోళ్ల పెంపకంపై పలువురు రైతులకు, మహిళలకు శిక్షణ ఇచ్చారు. పెరటి కోళ్ళకు వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వికాస సంస్థ ప్రతినిధి బీఎస్ రాజు, జి. శ్రీనివాస్, జార్జి ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది, మహిళా రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన సచివాలయం సేవలు

- తిర్లాపురంలో ఏడాదిన్నరగా మూలనపడిన కంప్యూటర్లు, ప్రింటర్లు
- రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ, సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం
- పట్టించుకోని అధికారులు
- ప్రజలకు పాట్లు



తిర్లాపురం సచివాలయం



సచివాలయంలో పనిచేయని కంప్యూటర్లు

వేలేరుపాడు: వేలేరుపాడు మండలం తిర్లాపురం గ్రామ పంచాయతీ సచివాలయంలో గతేడాదిగా కంప్యూటర్లు, ప్రింటర్లు మరమ్మతులకు గురై పనిచేయడంలేదు. సచివాలయానికి వచ్చే ప్రజలు తమ పనులను పూర్తికాక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ సచివాలయ పరిధిలోని కన్నాయిగుట్ట, తిర్లాపురం గ్రామాల్లో 525 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, ఓటరు కార్డు దరఖాస్తు నమోదు, ఎఫ్ఎంసీ (ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్), డెత్ సర్టిఫికెట్, ఇతర ఏ సర్టిఫికెట్ పొందాలన్నా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయకపోవడంతో ఏడాది కాలంగా ఏ సర్టిఫికెట్ కావాలన్నా ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము సచివాలయాల్లో కన్నాయిగుట్ట, తిర్లాపురం ప్రజలు దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోంది. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న కట్కూరు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటున్నారు. దీనికితోడు ఈ నెల ఏడో తేదీ నుంచి కొత్త రేషన్ కార్డుల కోసం ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తోంది. ఈ నమోదు పనులు సచివాలయ సిబ్బంది చేయాల్సి ఉంది. నెల రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ వ్యవధిలో దరఖాస్తులు చేసుకోవాలన్నా కంప్యూటర్లు పనిచేయకపోవడంతో ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కంప్యూటర్లకు మరమ్మతులు చేయించి, సేవలను అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం



ఏడాదిన్నరగా సచివాలయంలో కంప్యూటర్లు పనిచేయడంలేదు. దీనివల్ల సర్టిఫికెట్ల జారీలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఎఫ్ఎంసీ (ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్), డెత్ సర్టిఫికెట్, పొందాలన్నా ఎక్కువ రోజుల సమయం పడుతోంది. ఇతర సచివాలయాలకు వెళ్లాల్సి వస్తోంది.

– కారం దారయ్య, కన్నాయిగుట్ట

పట్టించుకోని అధికారులు



కొత్త రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే సచివాలయంలో సేవలు నిలిచిపోయాయి. ఈ విషయం అధికారులకు చెప్పినా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజా సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. ఏడాది కాలంగా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించాలి.

– మిరియాల శీతారాముడు, కన్నాయిగుట్ట

బిల్డర్‌కు నోటీసుల జారీ

జంగారెడ్డిగూడెం: స్థానికంగా అపార్ట్‌మెంట్‌కు సంబంధించి బిల్డర్‌కు నోటీసులు జారీ చేసినట్టు మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ తెలిపారు. 30 ప్లాట్లతో నిర్మించిన ఆ అపార్ట్‌మెంట్‌కు 10 శాతం మున్సిపాలిటీకి మోర్టగేజ్ చేయాల్సుందన్నారు. అయితే మోర్టగేజ్ చేసిన ప్లాట్లను మున్సిపాలిటీ నుంచి విడుదల చేయించుకోకుండా, ప్లాట్లను వేరే వ్యక్తులకు అమ్మేశారని తెలిపారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు బిల్డర్‌కు నోటీసులు జారీ చేశామని వివరించారు. సబ్ రిజిస్ట్రార్‌కు కూడా లేఖ రాశామని, దీంతో సబ్‌రిజిస్ట్రార్ కూడా నోటీసులు ఇచ్చారని చెప్పారు. ప్రభుత్వాన్ని పక్కదోవ పట్టించి రిజిస్ట్రేషన్ చేయించడంపై ఈ నోటీసులు జారీ చేసినట్టు కమిషనర్ తెలిపారు.

మూగజీవాలకు ఆహారం

కొయ్యలగూడెం: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రకాశరావుపాలెం అటవీ ప్రాంతంలో వానరాలకు, కొయ్యలగూడెంలోని గోశాలకు పండ్లు తదితర ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. పార్టీ మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి జెట్టి గురునాథరావు పుట్టినరోజు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు సూచన మేరకు పార్టీ యూత్ నాయకుడు బల్లె నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులు బల్లే పాపారావు, ఈడుపుగంటి తాతారావు, ఉండి ఆనందరావు, కొడారి సందీప్, కొడాలి చిన్న, పులపాకులు ఏసు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కలిగిస్తున్న రత్నప్రసాద్

చింతలపూడి : మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. చింతలపూడి కోర్టు ప్రాంగణంలో మంగళవారం పోష్ (ప్రివెన్షన్ ఆఫ్ సెక్సువల్ అఫెన్సెస్ ఎట్ వర్క్ ప్లేస్) చట్టంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి సంస్థలో మహిళల సమస్యలు పరిష్కరించడానికి కమిటీలను ఏర్పాటు చేసి, ఆ వివరాలను బహిరంగంగా పొందుపరచాలని సూచించారు. అసంఘటిత కార్మికులకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కమిటీలు ఉంటాయని, మహిళలు తమ సమస్యలపై ప్రత్యక్షంగా ఫిర్యాదు చేసుకోవచ్చని అన్నారు. ఫిర్యాదు దారుల వివరాలను గోప్యంగా ఉంచుతారని తెలిపారు. చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు మాట్లాడుతూ బాలలపై అత్యాచారాల నిరోధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. బాలలపై ఎటువంటి అఘాయిత్యం జరిగినా వెంటనే దగ్గరలోని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే, బాధితులకు వైద్య సదుపాయాల నిమిత్తం తక్షణ పరిహారాన్ని అందిస్తారని తెలిపారు. సాక్షుల వివరాలను గోప్యంగా ఉంచుతారని చెప్పారు. సదస్సులో ఐసీడీఎస్ పీఓ పి.మాధవి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సూపరింటెండెంట్ పీజీ నాయుడు, అడ్వకేట్ కేకేడీ భవాని, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



ద్వారకాతిరుమల : పంగిడిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సూపర్‌వైజర్ మేరి, తదితరులు



కొయ్యలగూడెం : ఎంపీడీఓ కార్యాలయం వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ కిరణ్‌కుమార్

ద్వారకాతిరుమల: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల నుంచి కిశోర బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.మేరి అన్నారు. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలో కిశోర వికాసం 2.0 కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో మేరి మాట్లాడారు. వ్యక్తిగత సమాచారాన్ని కిశోర బాలికలు ఎవరికీ షేర్ చేయకూడదన్నారు. తెలియని వ్యక్తులతో మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని సూచించారు. సైబర్ నేరాలపై 1950 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ నవీన మాట్లాడుతూ బాలికలు మొబైల్ వాడకం తగ్గించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో వచ్చే మోసపూరిత ప్రకటనలకు గురి కావద్దన్నారు. గౌరవ, మర్యాదలు, ప్రతిష్ట దెబ్బతినకుండా బాలికలు జాగ్రత్తలు పాటించాలన్నారు. యోగా వల్ల కలిగే ఉపయోగాలను తెలిపి, యోగాసనాలు వేయించారు. అనంతరం గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జీఎంఎస్‌కే నజీమా, లక్ష్మి, ఆశ వర్కర్ రత్న, అంగన్‌వాడీ వర్కర్లు శైలజ, సింధు, హెల్పర్ ధనలక్ష్మి, కిశోర బాలికలు తదితరులున్నారు.

కిశోరి వికాసం ర్యాలీ

కొయ్యలగూడెం: కిశోరి వికాసం 2.0 కార్యక్రమం వల్ల ప్రజల్లో తగిన అవగాహన కలుగుతుందని, తద్వారా కిశోరి బాలికలకు వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని ఎంపీడీఓ కె.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో నిర్వహించిన కిశోర వికాసం ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ అధికారులు, సిబ్బంది, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల కష్టాన్ని గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న పోచమ్మ

జంగారెడ్డిగూడెం: మాతా శిశు మరణాల రేటు తగ్గించడంలో, ఆసుపత్రిలోనే ప్రసవాలు అత్యధికంగా జరగడంలో ఆశ వర్కర్ల పాత్ర ప్రముఖమైందని ఆశ వర్కర్స్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోచమ్మ అన్నారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా స్థాయి శిక్షణ శిబిరం స్థానిక యూటీఎఫ్ హాల్లో ఆశ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు మంగతాయారు అధ్యక్షతన నిర్వహించారు. శిబిరంలో పోచమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్లు 24 గంటలు డ్యూటీ చేస్తున్నారని, కరోనా టైంలో ప్రాణాలకు తెగించి ఇంటింటికీ వెళ్లి ప్రజలను రక్షించడంలో ప్రధాన పాత్ర పోషించారని గుర్తుచేశారు. ప్రజారోగ్యం కోసం నిరంతరం పనిచేస్తోన్న ఆశ వర్కర్ల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలని, వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. పెన్షన్, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు మొడియం నాగమణి మాట్లాడుతూ కార్మికులు రాజకీయాలు అవగాహన చేసుకోవాలని, మంచి రాజకీయాల ద్వారానే సమాజం మంచిగా మారుతుంది అన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షులు పసల సూర్యారావు, పట్టణ నాయకులు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక, శారీరక దృఢత్వం



కామవరపుకోట : కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా పీడీ శారద



ద్వారకాతిరుమల : యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

కామవరపుకోట: యోగాతో మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని జిల్లా మహిళాభివృద్ధి, సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద అన్నారు. మంగళవారం కామవరపుకోట మండలం కళ్లచెరువు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో జంగారెడ్డిగూడెం సీడీపీఓ పి.బ్యూలా అధ్యక్షతన నిర్వహించిన కిశోర వికాసం, యోగాంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దైనందిన జీవితంలో యోగా చాలా ముఖ్యమన్నారు. యోగా చిన్న వయసు నుంచి అలవాటు చేసుకోవాలని సూచించారు. తడికలపూడి ఎస్సై పి.చెన్నారావు మాట్లాడుతూ సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా యోగాంధ్ర క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలను అభినందించారు. కార్యక్రమంలో కామవరపుకోట సెక్టర్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎస్ వీర కుమారి, బీవీఎల్ మంగాదేవి, అంగన్‌వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

రేపు టూరిజం మండపంలో యోగాడే

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన ఏపీ టూరిజం శాఖ హరిత రిసార్ట్స్ లోని కల్యాణ మండపంలో గురువారం యోగాడే కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ప్రకాష్ తెలిపారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ఇతర శాఖల ఉద్యోగులు యోగాసనాలు వేశారు.

ఆయిల్‌పామ్ పంటకు వారం రోజుల్లో నగదు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

టి.నరసాపురం: పంట విక్రయం తరువాత వారం రోజుల్లో ధర చెల్లించాలని జంగారెడ్డిగూడెం నవభారత్ ఆయిల్‌ఫామ్ పరిశ్రమ రైతు సంఘం అధ్యక్షుడు ఆచంట సూర్యనారాయణ అన్నారు. మంగళవారం మక్కినవారిగూడెంలో ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటను విక్రయించిన తరువాత 14 రోజులకు నగదును చెల్లిస్తున్నారని, దీనిని వారం రోజులకు కుదిస్తే రైతుకు వెసులుబాటుగా ఉంటుందని అన్నారు. ప్రస్తుతం నూనె రికవరీ టన్నుకు 19.36 శాతం ఉండటంతో, తెలంగాణ రైతులకు చెల్లించిన విధంగానే నవభారత్ ధర చెల్లిస్తోందని సూర్యనారాయణ తెలిపారు. కాగా, ఆయిల్‌ఫామ్ గెలలు నరికే సమయంలో పంట పక్వం గురించి రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టాలని కంపెనీని ఆయన కోరారు.

బురదజల్లే ప్రయత్నం చేస్తే ఊరుకోం



కామయ్యపాలెంలో జై జగన్ అంటూ నినాదాలు చేస్తున్న నాయకులు

బుట్టాయగూడెం: జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో దివంగత వంగవీటి మోహన్‌రంగ విగ్రహావిష్కరణకు వచ్చిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వైఎస్సార్ సీపీని, నాయకులపైనా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చందా ప్రసాద్ అన్నారు. జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలో మంగళవారం రాత్రి ఆయన విలేకర్లతో మాట్లాడారు. వంగవీటి మోహన్‌రంగ విగ్రహావిష్కరణకు సంబంధించి గ్రామంలో కొందరు వ్యక్తుల మధ్య విగ్రహం ఏర్పాటుపై పరస్పరం వాదనలు జరిగాయన్నారు. అయితే విగ్రహం ఏర్పాటు తేదీ నిర్ణయించి ప్రారంభిస్తున్న సమయంలో ఎమ్మెల్యే వైఎస్సార్ సీపీ ...... నా కొడుకులంటూ మాట్లాడ్డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్ సీపీ పాలనలో కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా ఈ మండలంలో పథకాలు అందించడమే కాకుండా అన్ని పనులు పూర్తిచేశామని గుర్తుచేశారు. ఎమ్మెల్యే పాలనపై దృష్టి పెట్టాలే తప్ప అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కించపరచాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. తాము తప్పు చేసినట్టు తెలిస్తే కేసులు పెట్టి జైలులో వేసుకోవచ్చని అన్నారు. సంబంధంలేని విషయంలో తమపైకానీ, తమ పార్టీపై కానీ బురదజల్లే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. అనంతరం జై జగన్ జై వైఎస్సార్‌సీపీ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీసా కమిటీలను అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పీసా కమిటీ సభ్యులు

వేలేరుపాడు: ప్రతి గ్రామంలో పీసా కమిటీలను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని పీసా మండల కమిటీ అధ్యక్షుడు కెచ్చెల మాధవ రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పీసా చట్టం పటిష్టంగా అమలు చేయడంతో పాటు, ఎల్‌టీఆర్ కేసులు నమోదు చేసి అక్రమ కట్టడాలను తొలగించాలని కోరారు. ఆర్‌అండ్‌ఆర్ అందరికీ ఇవ్వాలని, ప్యాకేజీ అందిన వారిని వెంటనే ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు తరలించాలని పేర్కొన్నారు. ప్యాకేజీ పొందిన భూముల్లో గిరిజనేతరులు సాగు చేయరాదని, అలా చేస్తే ఎల్‌టీఆర్ కేసులు నమోదు చేయాలని కోరారు. గిరిజనేతరులకు బినామీలుగా ఉన్న గిరిజనుల రేషన్ కార్డు రద్దు చేయాలని, ఆర్‌అండ్‌ఆర్ సర్వేకి ముందు ఐటీడీఏ పీఓ ఇచ్చిన వన్ ప్లస్ వన్ హామీని అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసా మండల కమిటీ ప్రధాన కార్యదర్శి, కోఆర్డినేటర్ వూయిక ముత్యాలరావు, ఉపాధ్యక్షుడు కాకా విజయ్, సహాయ కార్యదర్శి కంగల గంగరాజు, కోశాధికారి సోడే మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెంపునకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేడీ ముక్కంటి

జంగారెడ్డిగూడెం: వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టామని ఇన్‌చార్జి జేడీ ఎం ముక్కంటి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రైవేట్ ఒకేషనల్ కాలేజ్‌లో కొయ్యలగూడెం సాంఘిక సంక్షేమ శాఖ డివిజన్‌లో పరిధిలోని హాస్టల్స్ వార్డెన్లకు, సిబ్బందికి ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వచ్చే విద్యాసంవత్సరంలో హాస్టళ్లల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా సిబ్బంది కృషిచేయాలన్నారు. హాస్టళ్లల్లో అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలో ఉన్న 13 హాస్టళ్లలో ప్రస్తుతం 12 పని చేస్తున్నట్టు చెఆప్పరు. ఒకటి నిర్వాసిత మండలంలో ఉండటం వల్ల పనిచేయడం లేదన్నారు. ఈ హాస్టళ్ల మరమ్మతులకు రూ.70.85 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. 12 వసతి గృహాల్లో 8 హాస్టళ్లకు సొంత భవనాలు ఉండగా, వాటికి మరమ్మతులు చేసినట్లు తెలిపారు. కాగా 2017లో జంగారెడ్డిగూడెంలో మూతపడిన ఎస్సీ హాస్టల్స్‌ను తిరిగి మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, జిల్లా కలెక్టర్, సాంఘిక సంక్షేమశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. ఈ సందర్భంగా పట్టణంలోని వార్డు సంక్షేమ కార్యదర్శులు సాంఘిక సంక్షేమ శాఖను తమకు మాతృశాఖగా చేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ ముక్కంటికి వినతి పత్రం అందించారు. కొయ్యలగూడెం ఏఎస్‌డబ్ల్యూఓ ముప్పిడి రాజు పాల్గొన్నారు.

కిన్నెరసాని వాగు వద్ద పికెట్ ఏర్పాటు



కిన్నెరసాని వాగు వద్ద సర్వే చేస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు, సీఐ రమేష్

కుక్కునూరు: తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దు మధ్య గల కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను తరలించకుండా సిబ్బందితో పికెట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తహసీల్దార్ రమేష్ తెలిపారు. తెలంగాణలోని బూర్గంపాడు మండలంలో ప్రభుత్వ ఆసుపత్రి మరమ్మతుల నిమిత్తం కాంట్రాక్టర్ తెలంగాణ పరిధిలోకి వస్తుందంటూ కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న విషయంపై కుక్కునూరు రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం సర్వే చేశారు. ఇసుక తరలిస్తున్న ప్రాంతం ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వస్తుందని నిర్ధారించారు. ఇకపై ఆంధ్రా ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేందుకు పికెట్ ఏర్పాటు చేశామన్నారు.

యువకుడికి గాయాలు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. హెచ్‌సీ ఎన్ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన పి.మాధవస్వామి షాపులో బి.దుర్గాప్రసాద్ పనిచేస్తున్నాడు. ఈ నెల 26న మాధవస్వామికి చెందిన మోటార్ సైకిల్‌ను దుర్గాప్రసాద్ నడుపుతుండగా, స్థానిక కనకదుర్గమ్మ గుడి వద్ద టాటా ఏస్ వాహనం తగలడంతో దుర్గాప్రసాద్ గాయపడ్డాడు.

ప్రముఖ గుండె వైద్యుడు చినవెంకటేశ్వరరావు మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్)

బుట్టాయగూడెం: మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు బావ, ప్రముఖ గుండె వైద్య నిపుణుడు కుమ్మర చిన్నవెంకటేశ్వరరావు (70) మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లో మృతి చెందారు. బుట్టాయగూడెం మండలం తాళ్ల కట్టుపల్లికి చెందిన చిన్న వెంకటేశ్వరరావు హైదరాబాద్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎంబీబీఎస్ పూర్తి చేశారని బాలరాజు తెలిపారు 1997లో హైదరాబాద్ కేర్ ఆస్పత్రిలో గుండె వైద్య నిపుణుడిగా సుమారు 25 వేల మందికి పైగా గుండె శస్త్ర చికిత్సలు చేసి మంచి పేరు పొందారని చెప్పారు. అయితే ఇటీవల ఆయన అనారోగ్యానికి గురై మృతి చెందినట్లు తెలిపారు. ఆయన కుమార్తె సాయి హిమబిందు కూడా వైద్యురాలిగా ఉన్నారని చెప్పారు. చిన్నవెంకటేశ్వరరావు మృతి పట్ల బాలరాజు, రాజ్యలక్ష్మిలు దిగ్భ్రాంతి చెందారు. కాగా బుధవారం స్వగ్రామం టి.కట్టుపల్లిలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు బాలరాజు తెలిపారు.

శాంతిభద్రతలకు డ్రోన్ల వినియోగం

జంగారెడ్డిగూడెం: శాంతిభద్రతల పరిరక్షణలో డ్రోన్లను వినియోగిస్తున్నట్లు డీఎస్పీ యు.రవిచంద్ర తెలిపారు. డీఎస్పీ స్థానిక కార్యాలయానికి కేటాయించిన డ్రోన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో జూదాలు, అల్లర్లు, అసాంఘిక కార్యక్రమాలు అరికట్టేందుకు డ్రోన్ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని డీఎస్పీ చెప్పారు. ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు తన కార్యాలయానికి డ్రోన్ కెమెరాను కేటాయించారని తెలిపారు. డ్రోన్ కెమెరాను డీఎస్పీ పట్టణంలో ఎగరవేసి, దాని పని తీరును పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్సై జబీర్, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్ ఫిర్యాదుపై విచారణ

టి.నరసాపురం: సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్ రాజ్‌కుమార్‌పై వచ్చిన ఫిర్యాదుపై హౌసింగ్ పీడీ సత్యనారాయణ మంగళవారం విచారణ చేశారు. టి.నరసాపురానికి చెందిన సంధ్యాల వరప్రసాద్ తనకు ఇల్లు అమ్ముతానని రూ.4 లక్షలు తీసుకుని టి.నరసాపురం సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్ రాజ్‌కుమార్ మోసం చేశారని ఈ నెల 12న పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారని పీడీ తెలిపారు. ఈ మేరకు నివేదికను కలెక్టర్ వెట్రిసెల్వికి అందజేస్తామన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లతో ఆయన మండలంలో నిర్వహిస్తోన్న గృహనిర్మాణ పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో హౌసింగ్ మేనేజర్ ఆరీఫ్, డీఈలు రమాకాంత్, రంగారావు, ఎంపీడీఓ మణికుమారిలు పాల్గొన్నారు.